
# చంపినోడే.. అయ్యో అంటే...

- తెలంగాణ ప్రకటించి.. ఇచ్చే సందర్భంలో మీన మేషాలు లెక్కిస్తారా?
- ఆ పాపం కాంగ్రెస్ పార్టీది, ఆ పెద్దలది కాదా? : అమరవీరుల కుటుంబాల ఆక్రోశం

మేడ్చల్, నవంబరు 18: తెలంగాణ రాష్ట్రం సిద్ధించే క్రమంలో అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీ అలసత్వం వహించడంతో రాష్ట్రం కోసం ఎంతో మంది యువకులు ఆత్మాహుతి చేసుకున్నారు. వారి పని తీరు, వ్యవహార శైలిని చూసి నివ్వెరపోయిన యువత ప్రాణాలను తృణప్రాయంగా వదిలేశారు. బతుకు కంటే స్వరాష్ట్రమే ఎక్కువ అని భావించారు. రాష్ట్రం, కేంద్రంలో ఉన్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇవ్వడంలో మీనమేషాల లెక్కిస్తుండటంతో యువత బలిదానాలకు సిద్ధపడ్డారు. మేడ్చల్ ప్రాంతంలో శ్రీకాంత్, సురేశ్, దువ్వాసి కిషోర్ తదితరులు ఆత్మ బలిదానాలకు సిద్ధపడ్డారు. అప్పుడు అధికారంలో ఉన్న కేంద్రమంత్రి చిదంబరం మూడు రోజుల కిందట హైదరాబాద్‌కు వచ్చి అప్పటి ఆత్మహత్యలకు సారీ చెబుతూ.. తమ ప్రభుత్వానిది బాధ్యత కాదని చెప్పడంపై అమరవీరుల కుటుంబాల సభ్యులు మండిపడుతున్నారు. తెలంగాణ కోసం వెలకట్టలేని తమ బిడ్డ ప్రాణాలు పణంగా పెడితే సారీ చెప్పి, తప్పించుకోవడం దారుణమని మండిపడ్డారు. అప్పట్లో డిసెంబర్ 9 తర్వాత తెలంగాణ ఇస్తామని ప్రకటించి, వెంటనే ఇచ్చి ఉంటే వందలాది మంది యువకుల ప్రాణాలు పోయేవి కావని, పూర్తి బాధ్యత కాంగ్రెస్‌దే అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అన్యాయంగా బలిగొన్నరు...



నా కొడుకును అన్యాయంగా బలిగొన్నరు. తెలంగాణ ఇస్తామని చెప్పి, ఇయ్యలేదు. అందరితో పాటు నా కొడుకు తెలంగాణ కోసం ఉద్యమంలో పాల్గొన్నడు. రోజూ అదే పనిగా పొద్దున పోవడం, రాత్రి రావడం చేస్తుండే వాడు. అందేంటి అట్ల తిరుగతున్నావంటే తెలంగాణ వస్తే మన బతుకులు బాగుపడుతయి అమ్మా.. అనే చెప్పేటోడు. కాంగ్రెసోళ్లు తెలంగాణ ఇస్తామని చెప్పి, మాట మార్చిండ్రు. కావాలనే ఇయ్యడం లేదని చెపుతుండేటోడు. రాస్తారోకో, రైలురోకో ఉద్యమాల్లో పాల్గొన్న నా కొడుకు శ్రీకాంత్ తెలంగాణ కోసం ఆ రైలు కిందనే పడి చనిపోయిండు. చెప్పినప్పుడు తెలంగాణ ఇచ్చి ఉంటే నా కొడుకు కాదు, ఎంతో కొడుకులు బతికేటోళ్లు. తల్లులకు కడుపుకోత ఉండేది కాదు.

– ఆగమ్మ, అమరువీరుడు శ్రీకాంత్ తల్లి, మేడ్చల్

## ఆలస్యం కావడంతో ఆత్మహత్యలు



తెలంగాణ ఇయ్యడంలో ఆలస్యం చేయడంతో పాటు పిల్లలు ఆత్మహత్య చేసుకున్నారు. సీఎం కేసీఆర్ నిరాహార దీక్షతో తెలంగాణ ఇస్తామని చెప్పారు. ఆ తర్వాత ఏమైందో మాకు తెల్వదు. కానీ.. ఇయ్యలేదు. 15, 18, 20 ఏండ్ల పిల్లలు కూడా ఉద్యమం అని తిరిగేటోళ్లు. రోడ్ల మీద కూర్చోవడం, రోడ్ల మీదనే వంటలు చేసుకోవడం, ఎక్కడికక్కడ లారీ, బస్సులను ఆపడం చేస్తుండేటోళ్లు. ఎన్ని చేసినా కాంగ్రెసోళ్లు తెలంగాణ ఇయ్యకపోవడంతో కోపంతో మావోడు ప్రాణాలను తీసుకున్నడు. నా కొడుకు సురేష్ కూడా గోడపై తెలంగాణ కోసం చనిపోతున్నట్టు రాసి, ఉరేసుకున్నడు. ఆ పాపం అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వానిదే. తెలంగాణను దోచుకున్న నాయకులే యువకులు ప్రాణాలను తీశారు. చెప్పినట్టు తెలంగాణ ఇచ్చి ఉంటే ఇంత పని అయ్యేది కాదు.

– యాదయ్య, అమరవీరుడు సురేశ్ తండ్రి, కిష్టాపూర్, మేడ్చల్

## అసువులు బాసిన నలుగురు

డిసెంబరు 9న తెలంగాణ ఇస్తున్నట్టు ప్రకటించిన కేంద్ర మంత్రి చిదంబరం ఆ తర్వాత ఆంధ్ర పాలకుల ఒత్తిడికి తలొగ్గి, మాట వెనక్కి తీసుకోవడం ప్రజల్లో అలజడి రేగింది. ప్రధానంగా యువత ఆక్రోశం పెరిగింది. రోడ్లపైకి వచ్చి రాస్తారోకోలు చేశారు. రైలురోకోలు చేశారు. వంటావార్పుతో హోరెత్తించారు. ఆంధ్ర పాలకులను అడ్డుకున్నారు. అయినా, కమిటీల పేరుతో తాత్సారం చేయడంతో ఓపిక నశించి, తమ బలిదానాలతోనైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్పులు రావాలని కోరుకున్నారు. మేడ్చల్ ప్రాంతంలో శ్రీకాంత్, సురేశ్, కిషోర్ సింగ్‌తో పాటు మరో యువకుడు తెలంగాణ బలవన్మరణానికి పాల్పడ్డారు. శ్రీకాంత్ రైలు కింద పడి చనిపోగా, సురేశ్ ఉరేసుకొని చనిపోయాడు. కిషోర్, మరో యువకుడు ఉరేసుకొని చనిపోయారు. ఉద్యమ నేతలను పోలీసులు చాలా ఇబ్బంది పెట్టారు. అరెస్ట్ చేయడం, ఇంట్లో నుంచి బయటకు రాకుండా చేయడం, ప్రాణం పోయేలా కొట్టడం లాంటి ఎన్నో చర్యలు తీసుకున్నా వెరవలేదు. కేసీఆర్ ఇచ్చిన పిలుపుతో ఉద్యమంలో నిలబడ్డారు. ప్రస్తుత మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి తదితరులు ఉద్యమకారులకు అండగా నిలిచారు.



కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

## కాంగ్రెస్, జన సేనల మాటలు నమ్మొద్దు

ఇక్కడి వారంతా కూకట్‌పల్లి బిడ్డలే.. ❖ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 18: ఎన్నికలప్పుడు కలం, మతం పేరుతో హడావిడి చేసే రాజకీయ పార్టీలను నమ్మొద్దని.. కూకట్‌పల్లిలో నివసిస్తున్న వారంతా కూకట్‌పల్లి బిడ్డలేనని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్, ఇన్‌కార్ వన్‌సిటీ, కాలనీ 4వ ఫేజ్, మెడోల్యాండ్స్‌లలో శనివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాలలో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూకట్‌పల్లిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, తాగునీటి కష్టాలను తీర్చేందుకు రిజర్వాయర్లను నిర్మించామని, ఖాళీ స్థలాలను పార్కులుగా, క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కానీ.. ఎన్నికలు రాగానే స్థానికేతరులు ఇక్కడికి వచ్చి కులం మతం పేరుతో ఓట్లు అడగడం బాధాకరమన్నారు. కష్టపడి పనిచేసిన నాయకులను ప్రజలు గుర్తించాలని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం అన్ని వర్గాలు, మతాలకు సమప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో ఎల్‌ఐజీల పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ రావు, సాయిబాబా, శ్యామల రాజు, సురేశ్‌రెడ్డి తదితరులున్నారు.




యువజన సమ్మేళనంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్

## బీఆర్ఎస్‌కు యువత సంపూర్ణ మద్దతు

- మత తత్వ బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదు: ముఠా గోపాల్
- హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో జైసింహ యువసేన సమ్మేళనం

కవాడిగూడ, నవంబర్ 18: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులై బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతునిస్తున్నారని బీఆర్ఎస్ ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. ఈ మేరకు శనివారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ యువ ఆత్మీయ సమ్మేళన సభను ముషీరాబాద్ నియోజక వర్గం ముఠా జై సింహ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంభకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వల్లాల శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందించి ఉపాధి అవకాశాలు, విదేశీ ఉన్నత విద్యను అభ్యసించేందుకు అనేక పథకాలను ప్రవేశపట్టిందన్నారు. దీంతో స్వచ్ఛందంగా బీఆర్ఎస్ మద్దుతునిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగ యువతను ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జై సింహ మాట్లాడుతూ, మతతత్వ బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులను చిత్తుగా ఓడించాలన్నారు. యువసేన నాయకులు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన లబ్ధిదారులను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి ముఠా గోపాల్‌ను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ సికింద్రాబాద్ నియోజకవర్గం పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ, నిరంతరం ప్రజల మధ్య ఉండే ముఠా గోపాల్ రెండోసారి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, ఐటీ సెల్ ఇన్‌చార్జి శశాంక్, బీఆర్ఎస్ జాతీయ అధికార ప్రతినిధి దినేష్ చౌదరి, ముషీరాబాద్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ఎక్కాల కన్న, మాజీ కార్పొరేటర్లు వి.శ్రీనివాస్ రెడ్డి, ముఠా పద్మ నరేష్, బీఆర్ఎస్ నాయకులు సంగిశెట్టి జగదీష్, సినీ హీరో రోశం బాలు, భోలక్‌పూర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బింగి నవీన్ కుమార్, జునైద్ బాగ్దాది, షరీపోద్దీన్, మున్వర్ చాంద్, నియోజక వర్గం సోషల్ మీడియా ఇన్‌చార్జి ముఠా శివ సింహా తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి మాదిగలను తాకట్టుపెట్టిన మంద



అభివాదం చేస్తున్న మాదిగ సంఘాల జేఏసీ నాయకులు

- చిత్తశుద్ధి ఉంటే వర్గీకరణపై కేంద్రం ఆర్డినేన్స్ జారీ చేయాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు బ్రహ్మయ్య మాదిగ

ఖైరతాబాద్, నవంబర్ 18: రాష్ట్రంలోని 20 లక్షల మంది మాదిగలను మందకృష్ణ బీజేపీకి తాకట్టు పెట్టాడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం మాదిగ, మాదిగ ఉపకులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఇటు రాజు మాదిగ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ విశ్వరూప మహాసభ పేరిట ప్రధాని మోదీ ముందు మందకృష్ణ మోకరిల్లడం బాధాకరమన్నారు. గడిచిన 30 ఏండ్లుగా అన్ని పార్టీలు ఏబీసీడీ వర్గీకరణ హామీ పేరుతో మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. దశాబ్దాలు పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్‌కు అవకాశం ఉన్నా చేయలేదని, 2014లో వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని స్వయాన ప్రధాని మోదీ హామీ ఇచ్చి పదేండ్లుగా విస్మరించారన్నారు. మూడు దశాబ్దాల కాలంలో ఎందరో మాదిగ బిడ్డలు ఆత్మబలిదానాలు చేసుకున్నారని, కాని ఏ ప్రభుత్వం కూడా చిత్తశుద్ధి ప్రదర్శించలేదన్నారు. తాజాగా, ఆ ఎన్నికలు రాగానే వర్గీకరణ అంశాన్ని మళ్లీ వాడుకోవాలని చూస్తున్నారన్నారు. ఉషా మెహ్రా లాంటి కమిటీలు చెప్పినా అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలు కావాలనే పక్కన పెట్టాయన్నారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే వర్గీకరణ ఎందుకు చేయలేదని, కొత్త కమిటీ ఎందుకు ప్రకటించారని, కాలయాపన చేయడానికేనా?అని ప్రశ్నించారు. ఈ కమిటీని మాదిగ జాతి నమ్మొద్దని వద్దని పిలుపునిచ్చారు. 370 ఆర్టికల్ రద్దు, మహిళా బిల్లులను ఎలాంటి అడ్డంకులకు తావు లేకుండా పాస్ చేసి కేంద్ర ప్రభుత్వానికి నిజంగా వర్గీకరణ చేయాలని ఉంటే ముందుగా ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు పెట్టాలన్నారు. ఈ సమావేశంలో టీఎంహెచ్‌డీ వ్యవస్థాపకులు జున్నూ కనకరాజు మాదిగ, డాక్టర్ చీమ శ్రీనివాస్ మాదిగ, ప్రొఫెసర్ నతానియల్, కొక్కెర భూమన్న మాదిగ, గడ్డ యాదయ్య, రాందాస్, వేముల బలరాం తదితరులు పాల్గొన్నారు.



ఖాజాగూడలో ఇంటింటి ప్రచారంలో అభ్యర్థి అరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా

## వారంటీలు లేని గ్యారెంటీలను నమ్మొద్దు

ఖాజాగూడ ఇంటింటి ప్రచారంలో అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, నవంబర్ 18: వారంటీలు లేని గ్యారెంటీలతో వస్తున్న మోసగాళ్లను నమ్మొద్దని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడలో మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో శనివారం కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, వారంటీలు లేని గ్యారెంటీలతో మీ ముందుకు వస్తున్న మాయగాళ్లను నమ్మొద్దన్నారు. నమ్మితే నట్టేట ముంచి అభివృద్ధి, సంక్షేమాలకు ఆటంకాలుగా మారుతారన్నారు. ఎన్నికలు రాగానే పూటకో వేషం, మాయమాటలతో వచ్చే వారిని తరిమికొట్టాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమాలు పరుగులు తీస్తున్నాయని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని ఓర్వలేక అసత్యపు ప్రచారాలతో కొంతమంది పగటి వేషగాళ్లు వస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాలు పరుగులు తీస్తున్నాయని, భవిష్యత్తులో అంతే స్థాయిలో కొనసాగిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.